

గ్రూప్ - 2 ఫలితాల్లో సత్తా చాటిన రైతుబిడ్డ



మహేష్

కడెం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కొండుకూర్ గ్రామానికి చెందిన రైతు డోంగూరి రాజన్న కుమారుడు మహేష్ ఇటీవల గ్రూప్-4లో ఉద్యోగం సాధించి నిర్మల్ ఆర్డీవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ, గ్రూప్- 2కి సిద్ధమై రాష్ట్రంలోనే 50వ ర్యాంక్ సాధించాడు. ఇప్పుడు గ్రూప్- 2లో డిప్యూటీ తహసీల్దార్‌గా విజయం సాధించి కష్టాన్ని నిరూపించుకోవడం జరిగింది. మహేష్‌ను గ్రామంలో పలువురు కలిసి అభినందించారు.

పేదలకు అండగా నిలిచేది కాంగ్రెస్ ప్రభుత్వమే

● డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు



న్యూలోలంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు

దిలావర్‌పూర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పేదలకు కూడు, గూడు కల్పించాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ సంకల్పమని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కే.శ్రీహరిరావు అన్నారు. సోమవారం న్యూ లోలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు నుంచి గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వకుండా పేదలను దగా చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి రాగానే రేషన్ కార్డులు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో గుత్తేదారులకు దోచి పెట్టిన ఇళ్లు ఇవ్వకుండా పేదలను విస్మరించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకున్న ప్రతీ లబ్ధిదారుడికి తప్పనిసరిగా బిల్లులు చెల్లిస్తారని చెప్పారు. బిల్లు విషయంలో అపోహ పడొద్దని సూచించారు. పేదల ముఖాల్లో చిరునవ్వు చూడాల్లన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్దేశమన్నారు. డీసీసీ అధ్యక్షుడి వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దేవేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ అక్షర అనిల్, అడెల్లి ఆలయ మాజీ డైరెక్టర్ ధని రవి పాల్గొన్నారు.

జడ్పీ పీఠంపై.. సీనియర్‌ల నజర్

- బీజేపీ, కాంగ్రెస్ పార్టీల్లో నూతనోత్సాహం
- ఇక రెండు పార్టీల మధ్యనే పోటాపోటీ
- డీలా పడిన బీఆర్ఎస్ పార్టీ
- బీజేపీ నుంచి తెరపైకి సత్యనారాయణ గౌడ్, నర్సాగౌడ్, చంద్రకాంత్ పేర్లు
- కాంగ్రెస్ నుంచి సాధ సుదర్శన్, జుట్టు అశోక్, బుచ్చన్న..?
- బీఆర్ఎస్ నుంచి డాక్టర్ సుభాష్ రావు



వి. సత్యనారాయణ గౌడ్ (బీజేపీ)



డాక్టర్ సుభాష్ రావు (బీఆర్ఎస్)



సత్యం చంద్రకాంత్



జుట్టు అశోక్ (కాంగ్రెస్)

నిర్మల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాబోయే జిల్లా పరిషత్ ఎన్నికలపైనే ప్రస్తుతం ప్రధాన పార్టీలన్నీ సీరియస్‌గా దృష్టి సారిస్తున్నాయి. మంత్రి తరహా హోదా ఉన్న ఈ పదవిని ఎలాగైనా కైవసం చేసుకొని తమ రాజకీయ ఆధిపత్యాన్ని చాటుకునేందుకు ప్రధాన పార్టీలు సమాయత్తమవుతున్నాయి. ముఖ్యంగా అధికార కాంగ్రెస్, బీజేపీల నేతలు ఈసారి ఎలాగైనా జడ్పీ పీఠాన్ని కైవసం చేసుకోవాలని భావిస్తున్నారు. జడ్పీ చైర్మన్ పదవి బీసీ జనరల్‌కు కేటాయించడంతో ఈ రెండు పార్టీలకు చెందిన సీనియర్ నేతలు ఇప్పటి నుంచే తమ వంతు ప్రయత్నాలు మొదలుపెట్టారు. కాగా మొన్నటి అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి చెందిన బీఆర్ఎస్ ఈసారి జడ్పీ ఎన్నికల్లో పెద్దగా ప్రభావం చూపకపోవచ్చని అంటున్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్యనే ఈసారి గట్టి పోటీ నెలకొంటుందని విశ్లేషిస్తున్నారు. ముఖ్యంగా బీజేపీకి ముథోల్, నిర్మల్ నియోజకవర్గాల్లో ఆ పార్టీ ఎమ్మెల్యేలు అండగా నిలవబోతున్న నేపథ్యంలో జడ్పీ చైర్మన్ పదవి ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. నిర్మల్‌కు చెందిన సీనియర్ నేత, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ భర్త వి.సత్యనారాయణ గౌడ్ ఈ సారి ఆ పార్టీ తరపున జడ్పీ చైర్మన్ పదవి రేసులో ప్రధానంగా ఉన్నట్లు చెబుతున్నారు. ఈయనతో పాటు దిలావర్‌పూర్ మండలానికి చెందిన సీనియర్ నేత సత్యం చంద్రకాంత్ సైతం జడ్పీ పీఠంపై దృష్టి సారిస్తున్నారంటున్నారు. ఇప్పటికే పార్టీలోని కొంత మంది సీనియర్ నాయకులు ఆయన పేరును బీజేపీఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి ఎదుట ప్రతిపాదించినట్లు పేర్కొంటున్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన సంధానకర్తగా చంద్రకాంత్ వ్యవహరించిన కారణంగా పార్టీ నేతలు ఆయన పేరును తెరపైకి తెస్తున్నారంటున్నారు. అలాగే ముథోల్‌కు చెందిన సీనియర్ నేత నర్సాగౌడ్ సైతం ఈ సారి బరిలో నిలిచే అవకాశాలున్నాయని అంటున్నారు. కాగా అధికార కాంగ్రెస్ పార్టీలో కూడా జడ్పీ చైర్మన్ పదవి హట్ టాఫిక్‌గా మారుతోంది. ఆ పార్టీ నుంచి నిర్మల్ మండల మాజీ ఎంపీపీ సాధ సుదర్శన్ పేరు తెరపైకి వస్తోంది. అలాగే బలమైన బీసీ సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో చాలా మంది సీనియర్ నేతలు ఆయన పేరును తెరపైకి తెస్తున్నారు. ఈయనతో పాటు కుంటాలకు చెందిన మాజీ జడ్పీ చైర్మన్ జుట్టు అశోక్, మాజీ జడ్పీటీసీ బుచ్చన్న, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా పేరున్న నాళం శ్రీనివాస్‌ల పేర్లు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా బీ ఆర్ ఎస్ పార్టీ నుంచి ఆ పార్టీకి చెందిన సీనియర్ నాయకుడైనా ప్రముఖ వైద్యులు యు.సుభాష్ రావు బరిలో నిలిచే అవకాశాలున్నాయని అంటున్నారు. బీఆర్ఎస్‌ను చాలా మంది సీనియర్ నాయకులు వీడి కాంగ్రెస్, బీజేపీ పార్టీల్లో చేరినప్పటికి డాక్టర్ సుభాష్ రావు మాత్రం ఆ పార్టీకి అండగా నిలుస్తున్నారు.

బీజేపీలో ఉత్సాహం..

నిర్మల్, ముథోల్ నియోజకవర్గాలు తమ ఆధీనంలో ఉండడమే కాకుండా ఖానాపూర్ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో కూడా తమకు గట్టి కేడర్‌తో పాటు సానుభూతి ఎక్కువగా ఉన్న కారణంగా ఈ సారి బీజేపీ మెజార్టీ జడ్పీటీసీ స్థానాలను కైవసం చేసుకుంటుందని ఆ పార్టీ నేతలు బహిరంగంగానే పేర్కొంటున్నారు.

కాంగ్రెస్‌కు ప్రతిష్ఠాత్మకం..

అధికార కాంగ్రెస్ పార్టీకి జడ్పీ చైర్మన్ పదవి సవాలు కానుందని అంటున్నారు. జిల్లాలోని 18 జడ్పీటీసీ స్థానాలకు గానూ మెజార్టీ జడ్పీటీసీ పదవులను దక్కించుకోవడం ఆ పార్టీకి ఛాలెంజింగ్ కాబోతోంది. డీసీసీ ప్రసిడెంట్ శ్రీహరిరావు ఇప్పటికే 18 మండలాల నేతలతో సమాలోచనలు మొదలుపెట్టినట్లు చెబుతున్నారు.

తగ్గేదేలే అంటున్న బీఆర్ఎస్..

మొన్నటి అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి చెందిన బీఆర్ఎస్ జడ్పీ ఎన్నికల్లో ఇక తగ్గేదేలే అన్న చందంగా వ్యవహరించాలని భావిస్తున్నట్లు చెబుతున్నారు. ఆ పార్టీకి చెందిన సీనియర్ నేత బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు అత్యంత సన్నిహితునిగా వ్యవహరిస్తున్న డాక్టర్ సుభాష్ రావు ఈ సారి జడ్పీటీసీగా పోటీ చేసి చైర్మన్ పదవిని కూడా దక్కించుకోవాలని భావిస్తున్నారు.

పోలీస్ విధుల నుంచి తప్పిస్తూ జిల్లా ఎస్పీ ఉత్తర్వులు

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఆదివారం రాత్రి ఒక వర్గం ప్రజల మనోభావాలు దెబ్బతినేలా ప్రవర్తించిన ఇద్దరు పోలీసులను పోలీస్ స్టేషన్ విధుల నుంచి తప్పిస్తూ జిల్లా ఎస్పీ డా.జి. జానకి షర్మిల ఐపీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు. వారిని జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కి అటాచ్ చేశారు. జరిగిన సంఘటన మీద విచారణ చేసి రిపోర్ట్ సమర్పించాలని ఏఎస్పీ రాజేష్ మీనా ఐపీఎస్‌ను ఆదేశించారు. వారి మీద క్రమశిక్షణ చర్యలకుపై అధికారులకు సిఫారసు చేశారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై క్రమ శిక్షణ చర్యలు తప్పనిసరిగా తీసుకుంటాము. అలాగే ఈ సంఘటనపై ఎవరైనా సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారం చేస్తే వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలియజేశారు. ఇప్పటికే ఈ విషయం సద్దుమణిగినందున ఎవరు కూడా ఈ విషయం గురించి అసత్య ప్రచారాలు చేయకూడదని తెలిపారు.

నిర్మల్ వాసికి అవార్డు



ప్రైడ్ ఆఫ్ తెలంగాణ అవార్డు అందుకుంటున్న దృశ్యం

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రైడ్ ఆఫ్ తెలంగాణ అవార్డు 2025ను నిర్మల్ పట్టణానికి చెందిన ముత్యం సాయివీర్ కుమార్ గెలుచుకున్నారు. భారత దేశం వేగంగా అభివృద్ధి చెందుతున్న లీగ్‌టెక్, ఫిన్‌టెక్ సాస్ ప్లాట్‌ఫాం వైడర్, ఉత్తమ స్టార్టప్ విభాగంలో ప్రతిష్ఠాత్మక 'ప్రైడ్ ఆఫ్ తెలంగాణ 2025' అవార్డును గెలుచుకున్నట్లు ప్రకటించింది. 'ప్రైడ్ ఆఫ్ హైదరాబాద్' గుర్తింపు తరువాత, ఆటో మేషన్ ద్వారా వృత్తిపరమైన సేవలను మార్చడం లో వైడర్‌ను స్థాపించాడు. ఈ అవార్డులను ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, నటుడు సుధీర్ బాబు విజేతలకు పురస్కారాలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఉషా లక్ష్మి బ్రెస్ట్ క్యాన్సర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, డా. పి. రఘురామ్, ఐటీ రంగ నిపుణులు రమేష్ కాజా, సృష్టి ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ లక్ష్మీ, టీ హబ్ మాజీ సీఈవో శ్రీనివాస్, మహంకాళి, రౌండ్ టేబుల్ ఇండియా ప్రతినిధులు జి. సిద్ధార్థ్, వీనిష్ పాల్గొన్నారు.

దసరా, బతుకమ్మ వేడుకలకు

సౌకర్యాలు కల్పించాలి

- బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు గౌరీకర్ రాజు



ఖానాపూర్‌లో మాట్లాడుతున్న గౌరీకర్ రాజు

ఖానాపూర్, సెప్టెంబరు 29 (ఆంధ్ర జ్యోతి): రానున్న దసరా, బతుకమ్మ వేడుకలలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా సౌకర్యాలు కల్పించాలని బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు గౌరీకర్ రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఖానాపూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని అంతర్గత రోడ్లన్నీ గుంతలు పడి అధ్వానంగా ఉన్నాయన్నారు. దుర్గాదేవి విగ్రహ నిమజ్జనం, బతుకమ్మ నిమజ్జనాలు ఇబ్బంది లేకుండా సాగాలంటే అధికారులు స్పందించాలన్నారు. రహదారులపై గుంతలు పూడ్చడంతో పాటు వీధి దీపాలను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

ప్రజా సమస్యల

పరిష్కారానికి వేదికగా గ్రీవెన్స్ డే

- ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యం
- ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ డా. జానకి షర్మిల



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయం నందు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి నిర్మల్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వెంటనే ఫిర్యాదుదారుల ముందే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ల ద్వారా బాధితులకు చట్టపరంగా అందాల్సిన సహాయాన్ని అందిస్తూ వారి సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్‌కి వచ్చిన ఫిర్యాదు దారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదు దారుడికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ఫిర్యాదులు ఆన్‌లైన్‌లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో అని ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందన్నారు.

మద్యం దుకాణాలకు

దరఖాస్తుల స్వీకరణ

- జిల్లా ఎక్సైజ్ అధికారి అబ్దుల్ రజాక్

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మద్యం దుకాణాలకు దరఖాస్తులను స్వీకరించినట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి అబ్దుల్ రజాక్ తెలిపారు. జిల్లాలోని మద్యం దుకాణాలకు సంబంధించి సోమవారం ఏడు దరఖాస్తులు స్వీకరించినట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి రజాక్ తెలిపారు. ఈ దరఖాస్తుల స్వీకరణ గడువు అక్టోబరు 18వ తేదీతో ముగుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఒక్క దరఖాస్తు మూడు లక్షల రూపాయల రుసుము ప్రభుత్వ నిర్ణయించిందని చెప్పారు. ఒక వ్యక్తి ఎన్ని దరఖాస్తులైన వేయడానికి అవకాశం ఉందన్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో మద్యం దుకాణాలకు అక్టోబరు 23న లక్కీ డ్రా నిర్వహించబోతున్నట్లు చెప్పారు. 47 మద్యం దుకాణాలకు సంబంధించి గౌడ కులస్థులకు మూడు దుకాణాలు, ఎస్సీలకు ఐదు దుకాణాలు, ఎస్టీలకు ఒకటిగా రిజర్వేషన్లు కల్పించినట్లు చెప్పారు. రిజర్వేషన్ కల్పించిన దుకాణాలకు దరఖాస్తు చేసుకునేవారు. కుల ధ్రువీకరణ పత్రంతో పాటు మూడు లక్షల రూపాయల డీడీ లేదా చలాన్ జతపరుచాల్సి ఉంటుందన్నారు. కుల ధ్రువీకరణ పత్రం సమయానికి అందని పక్షంలో వారు నవంబరు 15వ తేదీ వరకు అందజేయాల్సి ఉంటుందన్నారు. అండర్ టేకింగ్ పత్రం జతపరుచాల్సి ఉంటుంది. డీడీ లేదా చలాన్లను జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి, నిర్మల్ పేరు తీయాల్సి ఉంటుందని తెలిపారు.

నర్సాపూర్(జి)లో రిజర్వేషన్ల రగడ

నర్సాపూర్(జి), సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ వార్డు మెంబర్ల రిజర్వేషన్ల జాబితా విడుదలలో జరుగుతున్న జాప్యం తీవ్ర రాజకీయ వేడికి కారణమైంది. మండలంలోని పలు గ్రామ పంచాయతీల రిజర్వేషన్ లిస్టును ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది ఉద్దేశ పూర్వకంగా బహిర్గతం చేయకుండా జాప్యం చేస్తున్నారని గ్రామస్థులు, ఎన్నికల ఆశావహులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చాక్‌పల్లి వంటి గ్రామాల్లోని ఆశావహులు రెండు రోజుల నుంచి కార్యాలయం వద్ద వేచి చూస్తున్నా సాంకేతిక కారణాల అంటూ సిబ్బంది తప్పించుకుంటున్నారని ఆరోపించారు.

దుర్గాదేవి ప్రతిమల నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



వినాయక సాగర్ చెరువును పరిశీలిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దుర్గాదేవి ప్రతిమల నిమజ్జనానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని దుర్గాదేవి విగ్రహాలను నిమజ్జనం చేసే వినాయక సాగర్ చెరువు (బంగల్‌పేట్ చెరువు)ను కలెక్టర్ పరిశీలించారు. చెరువుగట్టు వెంబడి రక్షణ కోసం ఏర్పాటు చేసిన బారికేడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దుర్గాదేవి విగ్రహాల నిమజ్జనంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని చెప్పారు. మెరుగైన లైటింగ్‌తో పాటు క్రేన్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలు ఎవరు చెరువులోకి దిగకుండా ఉండేలా పటిష్ఠ చర్యలు చేపట్టాలన్నారు. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుకోవానలి సూచించారు. నిమజ్జనం కార్యక్రమం పూర్తయిన వెంటనే పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. అంతకముందు కలెక్టర్ బంగల్‌పేట్ శ్రీ మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన కలెక్టర్‌కు పూజారులు ఘన స్వాగతం పలికారు. మహాలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కలెక్టర్‌కు అమ్మవారి ఫోటోను బహూకరించారు. పూజారులు ఆలయ చరిత్రను, విశిష్టతను వివరించారు. దసరా పర్వదినం సందర్భంగా ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున వారికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, మున్సిపల్ అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ప్రజావాణి సమస్యలను పరిష్కరించాలి

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రతీ దరఖాస్తును పరిశీలించి తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. అనంతరం ఇటీవల నిర్మల్ జిల్లాకు జల్ సంచాయ్ - జన భాగిధారి కార్యక్రమంలో అవార్డు లభించినందున అధికారులను కలెక్టర్ అభినందించారు. భవిష్యత్తులో రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తూ, మరిన్ని అవార్డులు సాధించి, జిల్లా పేరును దేశవ్యాప్తంగా నిలపాలని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఎన్నికల ప్రవర్తన నియమావళిని అనుసరించి, ఎన్నికల నియమావళి ముగిసే వరకు ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. కోడ్ ముగియగానే ప్రజావాణి కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభిస్తామన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో ఆర్డీవో రత్న కళ్యాణి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

● రాష్ట్ర ఎన్నికల అధికారి రాణి కుముదిని



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల అధికారి రాణి కుముదిని తెలిపారు. సోమవారం సాయంత్రం స్థానిక సంస్థల ఎన్నికల నియమావళి అమలుపై అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, జిల్లా కలెక్టర్లు ఆమెతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎన్నికల నియమావళి అనుసరిస్తూ రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, వాల్ రైటింగ్‌లను తొలగించాలని తెలిపారు. గ్రామస్థాయిలో ఎన్నికలు నిర్వహించడానికి అన్ని సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ, వార్డు సభ్యులు సర్పంచ్‌ల ఎన్నికల నిర్వహణకు సిబ్బందికి బాధ్యతలు అప్పగించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ కలెక్టరేట్ సమావేశం మందిరం నుంచి మాట్లాడుతూ జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఎటువంటి లోటుపాట్లు జరగకుండా ఎన్నికలను నిర్వహించాలన్నారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి పకడ్బందీగా అమలయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసు, రెవెన్యూ, తదితర శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సమావేశంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీవో రత్న కళ్యాణి, జడ్పీ సీఈవో గోవింద్, డీపీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

బతుకమ్మ పండుగ అంటే ఎంతో ఇష్టం



● సిందె యమున, ఇచ్చోడ

తొమ్మిదిరోజుల పాటు తీరొక్క పూలబతుకమ్మలను పేర్చి గౌరమ్మను పూజిస్తూ ఆడపడుచులందరూ ప్రకృతి ఆరాధన చేసుకునేదే బతుకమ్మ పండుగ. చప్పట్లు, కొలాలు వేసుకుంటూ ఆడిపాడటం ఇష్టంగా ఉంటుంది. మా కాలనీ టీచర్స్‌కాలనీలో మహిళలంతా తొమ్మిది రోజులు సంతోషంగా ఈ పండుగను ఘనంగా జరుపుకుంటాం. పండుగను సంబురంగా జరుపుకుంటాం.

బతుకమ్మ పేర్చడం ప్రత్యేకం..



● మెరుగు రాధసుధ, ఇచ్చోడ

రంగురంగు పువ్వులతో బతుకమ్మ పేర్చడం చాలా ప్రత్యేకంగా ఉంటుంది. ప్రకృతితో కూడుకున్న పండుగ ఇది. బతుకమ్మలో వాడే ప్రతీ పువ్వులో ఔషధగుణాలు ఉంటాయి. బతుకమ్మ వేడుకలకు మా కాలనీలోని మహిళలంతా దుర్గమాత మండపం వద్ద బతుకమ్మ పాటలతో తొమ్మిది రోజులు సంబురంగా జరుపుకుంటాం. ఇంటినుంచి బతుకమ్మను తీసుకుని వచ్చి ఒకదగ్గర ఆడిపాడడం మాకు ప్రత్యేకంగా ఉంటుంది.

ఉత్సాహంగా జరుపుకొంటాం..



● డాక్టర్ పూజిత, వైద్యురాలు, ఇంద్రవెల్లి

తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు పెద్దపండుగ బతుకమ్మ పండుగ. పూలను దేవతగా పూజించే సంస్కృతి, సంప్రదాయం. ఆచారంగా ఉన్న ఈ పండుగను చిన్ననాటి నుంచి స్థానికంగా ఉన్న మహిళలు, స్నేహితులు, బంధువులతో బతుకమ్మ పండుగను ఎంతో ఆనందంగా, ఉత్సాహంగా జరుపుకుంటాము. ఉద్యోగరీత్యా బిజీగా ఉన్నప్పటికీ ఈ పండుగ మాకు ప్రత్యేకం.



భక్తిశ్రద్ధలతో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



అక్షరాభ్యాసంలో పాల్గొన్న చిన్నారులు

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో జరుపుతున్నారు. సోమవారం బోజ్జవార్ మందిర్‌లో ప్రతిష్ఠించిన దుర్గామాత వద్ద చిన్నారులకు సాముహిక అక్షరాభ్యాసం చేశారు. కార్యక్రమంలో డీపీఎస్ ఉపప్రధానార్చకులు బ్రహ్మచైతన్యశర్మ, అధ్యక్ష, కార్యదర్శులు రఘు జోషి, పంకజ్ దేషాండే, సభ్యులు రమాకాంత్, అమూల్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ : మండలంలోని కుంటాలలో దుర్గాదేవి విగ్రహానికి సోమవారం మహిళలు ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన ప్రసాద వితరణ అందించారు.

తాంసి : తాంసిలోని శారదాదేవి మండపాల వద్ద సోమవారం మహాయజ్ఞం కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆయ మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

బోథ్ : మండలంలోని కనుగుట్ట గ్రామంలో సోమవారం దుర్గాదేవి పల్లకి ఊరేగించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళా భక్తులతో పాటు గ్రామస్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో దుర్గాదేవి నవరాత్రులు అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగిస్తున్నారు.

దుర్గాదేవి, బతుకమ్మల నిమజ్జనోత్సవానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం

ఉట్నూర్ : మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించనున్న బతుకమ్మలు, దుర్గాదేవి నిమజ్జనోత్సవానికి హాజరుకావాలని కోరుతూ హిందు ఉత్సవసమితి ప్రతినిధులు ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మబొజ్జుపటేల్‌ను ఆహ్వానించారు. సోమవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హిందు ఉత్సవ సమితి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీరామ్‌నాయక్, సాడిగేరాజేశ్వర్, ప్రతినిధులు డాక్టర్ సాడిగే రాజగోపాల్ తదితరులు ఆహ్వానించారు.

బోథ్ : దుర్గాదేవి ప్రతిష్ఠాపించి ఎనిమిదవ రోజున మండలంలో దుర్గాదేవి ఆలయాల వద్ద భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

విజయదశమి ఉత్సవాలకు ఏర్పాట్లు..

ఆదిలాబాద్ టౌన్ : డైట్ మైదానంలో దసరా వేడుకలు జరగనున్న నేపథ్యంలో సోమవారం రావణ దహన కార్యక్రమానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వేదపండితులు మాట్లాడుతూ... విజయదశమి పర్వదినాన ఆయుధపూజ, శమి చెట్టు పూజ ఉంటుందని, అనంతరం రావణ దహనం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు ప్రమోద్, హిందూ ధర్మిక సంస్థల ప్రతినిధులు బండారి సంతోష్, సూర్యకాంత్, మాదవ్, శశికళ పాల్గొన్నారు.

మావల : మండల కేంద్రంలోని దుర్గాదేవి మండపం వద్ద వైభవంగా కుంకుమ అర్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. నిర్వాహకులు, మహిళలు రాణి కళ్యాణి, రుచిత, విజయ, ప్రియాంక, మమత, కళ్యాణి పాల్గొన్నారు.

బజార్ హత్నూర్: దుర్గా దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని ముత్యపేట్, గిర్నూర్ గ్రామాల్లో సోమవారం మండపాల వద్ద భక్తి శ్రద్ధలతో కుంకుమార్చన పూజ కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారమే రిజర్వేషన్లు

● ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఇంద్రవెల్లి , సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారమే అధికారులు రిజర్వేషన్లను ఖరారుచేశారని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో కాంగ్రెస్ పార్టీ ముఖ్యకార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రిజర్వేషన్లను తయారీలో తనకు ఎలాంటి సంబంధం లేదని, అసత్య ప్రచారంను మానుకోవాలన్నారు. అనంతరం స్థానిక సంస్థల ఎన్నికలపై కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. కాంగ్రెస్ పార్టీ తరఫున బరిలో ఉన్న ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ అభ్యర్థులు గెలుపే లక్ష్యంతో కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఉత్తం, మసూద్, యాకూబ్, జహీర్, సోన్ కాంబ్లే, జితేందర్, పవార్, దుదిరాం, మెస్రం నాగ్‌నాథ్ ఉన్నారు.

ఉట్నూర్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకొని సత్తా చూయించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

సనాతన ధర్మం గొప్పది

● ఎమ్మెల్యే పాయలశంకర్



అమ్మవారికి హారతి ఇస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్ అర్బన్, సెప్టెంబరు29 (ఆంధ్రజ్యోతి):సనాతన ధర్మం గొప్పదని ఎమ్మెల్యే పాయలశంకర్ అన్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బేల మండల కేంద్రంలోని మహంకాళి ఆలయంలో సోమవారం నిర్వహించిన మహాహారతి పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కోసం ఇటీవలే రూ.20లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. అమ్మవారి కరుణకటాక్షాలతో ప్రజలందరు సుఖ సంతోషాలతో ఉండాలన్నారు. ఇందులో బీజేపీ నాయకులు ఇంద్రజిత్, కృష్ణ, రాము, పోతరాజు, నవీన్, మురళిధర్, టాక్రె, గణేష్, నవీన్, సందీప్ హారీష్,భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మహిళల వైద్య శిబిరానికి విశేష స్పందన

నేరడిగొండ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని తర్నం కె.గ్రామంలో నిర్వహించిన స్వస్త్ నారీ సశక్తి పరివార్ మహిళల వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. డాక్టర్ సుమలత డీటీసీవో ఆదిలాబాద్ టీబీపై అవగాహన కల్పించారు. వైద్యులు, మహిళలకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్‌లు సంతోష్, స్వర్ణలత, ఏఎన్ఎం గంగామణి, శ్యామల, ఆశా ఆనంద తదితరులు ఉన్నారు.

'నేను తప్పు చేయలేదు, విధుల్లో కొనసాగించండి'

బోథ్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల హాస్టల్‌కేర్ టేకర్‌గా విధులు నిర్వహిస్తున్న స్వప్న తనను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ సోమవారం ఆదిలాబాద్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అధికారులకు విన్నవించారు. హాస్టల్లో జరిగిన సంఘటనలతో తనకు సంబంధం లేదని, తనను కావాలని కొంతమంది విధుల్లో నుంచి తొలగించేలా అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చారన్నారు.

గుడుంబా తయారు చేసిన ఇద్దరిపై కేసు

బజార్ హత్నూర్ , సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూతాయి(బి) గ్రామంలో గుడుంబా తయారు చేస్తున్న ఇద్దరిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై సంజయ్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. భూతాయి(బీ) గ్రామానికి చెందిన ముర్కుటే మారుతి, ముర్కుటే యోగేష్‌లు గుడుంబా తయారు చేస్తున్నట్లు సమాచారం రాగా తనిఖీ చేశారు. వారివద్ద 12 లీటర్‌ల గుడుంబాను స్వాధీనపర్చుకుని మరో 50 కిలోల ఇప్ప పువ్వును అక్కడే ధ్వంసం చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వాహనం ఢీకొని విరిగిన విద్యుత్ స్తంభం

బోథ్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కౌటాబి గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి విద్యుత్ స్తంభాన్ని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. దీంతో గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ అధికారులు వంగిపోయిన విద్యుత్ స్తంభం స్థానంలో నూతన విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేశారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

బోథ్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డెమ్మి గ్రామానికి చెందిన సప్లె ఈశ్వర్ సింగ్ అనే వ్యక్తి అరకిలో గంజాయి తరలిస్తుండగా సోమవారం పట్టుకున్నామని సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై శ్రీ సాయిలు తెలిపారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా మోటార్ సైకిల్ పై వెళుతున్న గంజాయితో ఆయనను పట్టుకున్నామని తెలిపారు. దీంతో అరకిలో గంజాయి మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వారు తెలిపారు.

అమ్మవారి దయతో ప్రజలంతా సంతోషంగా ఉండాలి

మావల , సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అమ్మవారి దయతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి ఆకాంక్షించారు. సోమవారం పట్టణంలోని పిట్టల వాడలోని హనుమాన్ మందిర సమీపంలో కాలనీవాసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గమాత మండపంలో దుర్గమాతని దర్శించుకొన్నారు.

బాసర ఆలయాన్ని దర్శించుకున్న బోథ్ ఎమ్మెల్యే



బాసర ఆలయం వద్ద ప్రసాదం తీసుకుంటున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి దేవస్థానాన్ని సోమవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా ఎనిమిదవ రోజు మూల నక్షత్రం సందర్భంగా మహాగౌరి అలంకరణ సందర్భంగా దర్శించుకున్నారు. వీరి వెంట బాసర మండల కన్వీనర్ శ్యామ్, బిద్రెల్లి సర్పంచ్ డిగంబర్, తహసీల్దార్ పవన్ చంద్ర తదితరులు ఉన్నారు.

ఘనంగా సద్దుల బతుకమ్మ సంబురాలు



జాతర్లలో సద్దుల బతుకమ్మలతో యువతులు, మహిళలు

బజార్‌హత్నూర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాతర్ల, రాంనగర్ గ్రామాలలో సోమవారం సద్దుల బతుకమ్మ సం బురాలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పటేల్‌లు గోడం భీంరావు, గోడం మాన్కు, మాజీ సర్పంచ్ ఆత్రం లక్ష్మి బాయి, నాగోరావు, దేవారి మాడావి నాగేష్, మహాజన్ కోట్నాక్ సోనేరావు గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

'ఎన్నికలకు సిద్ధంగా ఉండండి'

బోథ్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని, జడ్పీటీసీ ప్రబారి రైల్వే బోర్డు మెంబర్ మాజీ అధ్యక్షులు జీవీ రమణ పిలుపునిచ్చారు. సోమవారం సోనాల మండల కేంద్రంలో బీజేపీ అధ్యక్షుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతికార్యకర్త అభ్యర్థుల గెలుపు కోసం పని చేయాలన్నారు. సమావేశంలో ఎంపీటీసీల ప్రభరి రంజిత్‌తో పాటు సోనాల మండల బిజెపి అధ్యక్షులు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలు

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పంజాబ్ రాష్ట్రంలో ఇటీవల జరిగిన జాతీయ సీపీఐ మహాసభలు విజయవంతంగా సాగాయని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని... మహాసభల విశేషాలను వెల్లడించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని మహాసభల్లో తీర్మానించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో నేతలు కుంటాల రాములు, రమేష్, మహబూబ్ ఖాన్ పాల్గొన్నారు.



భైంసాలో ఎన్నికల సిబ్బందికి శిక్షణనిస్తున్న ట్రైయినర్ కృష్ణ

ఎన్నికల సిబ్బందికి శిక్షణ తరగతులు

భైంసా, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వేదం హైస్కూల్‌లో సోమవారం స్థానిక సంస్థల ఎన్నికల సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. మాస్టర్ ట్రేయినర్లు నంగొళ్ల కృష్ణ ,సుభాష్,గోపాల్‌లు ఎన్నికల విధానాలు, నియమ,నిబంధనలు, పాటించాల్సిన నియమావళి తదితర అంశాలపై విపులంగా అవగాహన కల్పించారు. భైంసా ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, ఎంపీవో చంద్రశేఖర్, ఎంఈవో సుభాష్‌లు తదితర అధికారులు శిక్షణ తరగతుల సందర్భంగా ఎన్నికల సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు అంశాలను వివరించారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది పారదర్శకతతో వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల నియమావళికి అనుగుణంగా నడుచుకోవాలని పేర్కొన్నారు. సమస్యలు, సందేహాలు ఏర్పడితే మాస్టర్ ట్రేయినర్లను, అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని వెల్లడించారు.

ముథోల్: కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక సంస్థల ఎన్నికలు - 2025 అంశంపై మండలంలోని 110 మంది ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏడీఈఏ ఎంపీడీవో శివ కుమార్, ట్రైనర్ ఆఫ్ ట్రైనీలు (టీవోటీ)లు రవీందర్ రెడ్డి, అనిల్, విజయ్ కుమార్, తదితరులు హాజరయ్యారు.

లోకేశ్వరం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల లోకేశ్వరంలో సోమవారం ప్రిసైడింగ్ అధికారుల (పీవో)లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక సంస్థలు ఎన్నికలు -2025 అంశంపై లోకేశ్వరం మండల ఉపాధ్యాయులకు మురళి, శ్రీధర్ రెడ్డిలు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సల్మాన్ రాజ్, వెంకట్, రమేష్ పాల్గొన్నారు.

తానూర్: మండలంలోని పీవో, ఏపీవోలకు శిక్షన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కేంద్రం తానూర్‌లోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఎంపీడీవో నసీరోద్దిన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల కోసం సిబ్బంది సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో విశ్వేశ్వరరావ ఉన్నారు.

ముథోల్: లెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక సంస్థల ఎన్నికలు - 2025 అంశంపై మండలంలోని 110 మంది ఉపాధ్యాయులకు శిక్షణ కా ర్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కా ర్యక్రమానికి ఏడీఈఏ ఎంపీడీవో శివ కుమార్, ట్రైనర్ ఆఫ్ ట్రైనీలు (టీవోటీ)లు రవీందర్ రెడ్డి, అనిల్, విజయ్ కుమార్ హాజరయ్యారు.

కుంటాల: మండల కేంద్రం కుంటాలలో త్వరలో జరగబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో భాగంగా సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. పోలింగ్ స్టేషన్‌లో ప్రిసైడింగ్ ఆఫీసర్ అధికారాల గురించి, పోలింగ్ స్టేషన్‌లో చేపట్టవలసిన అంశాల గురించి శిక్షణ తరగతిలో వివరించారు.



పీవోలకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

వైభవంగా శరన్నవరాత్రి వేడుకలు



శివాజీ నగర్‌లో కుంకుమార్చన నిర్వహిస్తున్న మహిళలు

ఖానాపూర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా సాగుతున్నాయి. సోమవారం 8వ రోజు అమ్మవారు భక్తులకు సరస్వతీ దేవి రూపంలో దర్శనమిచ్చారు. మండల కేంద్రంలోని శివాజీ నగర్‌లో కుంకుమార్చన నిర్వహించారు.

కుంటాల: కుంటాల మండలంలో దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొన సాగుతున్నాయి. ఏడు రోజుల క్రితం ప్రారంభమైన ఉత్సవాల్లో భాగంగా ప్రతీ రోజు మండలంలోని అన్ని గ్రామాల్లో దుర్గామాత మం డపాల వద్ద ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ దుర్గమ్మకు ప్రీతిపాత్ర మైన నైవేద్యాలు సమర్పిస్తూ రాత్రి వేళల్లో సాంస్కృతిక కార్యక్రమాలు చేపడుతున్నారు.

ఎంపీ నగేష్ ప్రత్యేక పూజలు

నిర్మల్ రూరల్ : నందిగుండం దుర్గామాత ఆలయంలో ఎంపీ నగేష్ ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. ఎంపీ వెంట బీజేపీ రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్, పూదరి రంజిత్‌లు ఉన్నారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకటాచారి ఎంపీ నగేష్‌ను శాలువాతో సన్మానించారు.



ఎంపీ నగేష్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు




అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే రామరావు పటేల్

బాసర, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : బాసర సరస్వతి అమ్మవారిని సోమవారం ముథోల్ ఎమ్మెల్యే రామరావుపాటిల్ దర్శించుకున్నారు. మూల నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు పి. సాయినాథ్‌పటేల్, మాజీ సర్పంచ్ సతీశ్వర్‌రావు, శివాజీ, పి. రాజేశ్వర్, బి. రమేష్ తదితరులు ఉన్నారు.

సంబురంగా పూల పండుగ



రాంపూర్ గ్రామంలో బతుకమ్మ ఆడుతున్న ఆడపడుచుల దృశ్యం

నర్సాపూర్(జి), సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాం పూర్ గ్రామంలో వైభవంగా బతుకమ్మ సంబరాలు జరిగాయి. గ్రా మ మంతా పండుగ శోభతో కళకళలాడింది. మహిళలు, యువతులు ఉద యమే ఇళ్లల్లో రంగవల్లులు తీర్చిదిద్ది. శుచిగా స్నానాలు చేసి కొత్త వస్త్రా లు ధరించారు. అప్పుడే వికసించిన గుమ్మడి, తంగేడు, బంతి, చామంతి వంటి రకరకాల పూలతో బతుకమ్మలను తీర్చిదిద్దే పనిలో నిమగ్నమ య్యారు. వివిధ రంగుల పూలను రమణీయంగా పేర్చి, శిఖరంపై గౌరమ్మ ను ఉంచి, వాటికి పసుపు, కుంకుమ, గంధంతో అలంకరించి పూజించారు.

ఆటపాటలతో సందడి..

సాయంత్రం వేళ గ్రామంలో మహిళలు, యువతులు సాంప్రదాయ దుస్తులు ధరించి, బతుకమ్మలను నెత్తిన పెట్టుకొని ఊరేగింపుగా ప్రధాన కూడలి వద్దకు చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన వేదికపై బతుకమ్మలను ఉంచి, చుట్టూ గుంపులు గుంపులుగా చేరి కోటాలాలు వేశారు. లయ బద్ధంగా చప్పట్లు కొడుతూ ఉల్లాసంగా, ఉద్వేగంగా పాటలు పాడుతూ యువతులు, ఆడపడుచులు కలిసి నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా వారు ఆలపించిన జానపద బతుకమ్మ పాటలు ఆ ప్రాంతాన్ని భక్తి పారవశ్యంలో ముంచెత్తాయి. తమ కుటుంబ శ్రేయస్సు, పాడి పంటలు సమృద్ధిగా ఉండాలని, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని గౌరమ్మను వేడుకున్నారు. ఈ వేడుకల్లో గ్రామ పెద్దలు, యువకులు ఉత్సాహంగా పాల్గొని, మహిళల నృత్యా లను తిలకిస్తూ, పండుగ వాతావరణాన్ని మరింత పెంపొం దించారు.

ముగింపు వేడుక..

బతుకమ్మ ఆటపాలు ముగిసిన అనంతరం మహిళలందరూ కలిసి బతుకమ్మను ఊరేగింపుగా చెరువు వద్దకు తీసుకెళ్లి, భక్తి శ్రద్ధలతో నీటిలో నిమజ్జనం చేశారు. ఆ తర్వాత ఒకరికొకరు తాంబూలం (పానకం, పండ్లు) ఇచ్చిపుచ్చుకొని, పెండ్లికాని యువతులకు వాయినాలు ఇచ్చి, ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పంపిణీ చేసిన ప్రసాదాలు (మలిద, సకినాలు) తీపి జ్ఞాపకాలను మిగిల్చాయి. రాంపూర్ గ్రామంలో జరిగిన ఈ బతుకమ్మ సంబరాలు తెలంగాణ సంస్కృతి, ఆత్మగౌరవాన్ని మరోసారి చాటి చెప్పాయి.

ముథోల్‌లో పట్ట పగలు చోరీ

● రూ. 5 లక్షల నగదు, 5 తులాల బంగారం,

15 తులాల వెండి అపహరణ

ముథోల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ముథోల్ నియోజకవర్గ కేం ద్రమైన ముథోల్‌లోని ఎల్లమ్మ ఆలయ సమీపంలో తాళం ఉన్న ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు తాళం పగుగొట్టి చొరబడి సోమవారం మధ్యాహ్నం దొంగతనానికి పాల్పడిన సంఘటన వెలుగు చూసింది. పూర్తి వివరాల్లోకి వెళ్తే బాధితుల కథనం ప్రకారం మహారాష్ట్రకు చెందిన గంగాసాగర్ అనే మహిళతో పాటు కుటుంబ సభ్యులు ముథోల్‌లోని ఎల్లమ్మ కాలనీ సమీపంలో ఓ ఇళ్లను కొనుగోలు చేసి అందులో సంవత్సరమున్నర నుంచి ఉంటున్నారు. అయితే షాపింగ్ చేసేందుకు ఇంటికి తాళం వేసి సోమవారం ఉదయం నిజామాబాద్‌కు వెళ్లారు. అయితే నిజామాబాద్‌కి వెళ్లి తిరిగి సాయంత్రం సమయంలో ఇంటికి చేరుకున్నారు. దీంతో ఈ విషయం బయట పడింది. ఇంటి తాళం పగులగొట్టి గుర్తు తెలియని దొంగలు ఇంట్లోకి చొరబడ్డారు. ఇంట్లో ఉన్న బీరువాని పగులగొట్టి అందులో ఉన్న ఐదు లక్షల నగదు, ఐదు తులాల బంగారు ఆభరణాలు, 15 తులాల వెండి ఆభరణాలు దొంగలు ఎత్తుకెళ్లారని కుటుంబ సభ్యులు తెలిపారు. రోడ్డు కు దగ్గరలోనే ఈ ఇళ్లు ఉన్నప్పటికీ పట్టపగలు చోరీ జరగటం గమనార్హం. అయితే ముథోల్‌లో మరో వ్యాపారం పెట్టుకోవడానికి నగదును ఇంట్లో ఉంచుకున్నామని బాధిత కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. అయితే చోరీకి గురైన ఆభరణాలు, నగదుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. బాధితులు ఈ ఘటనపై 100 డయల్‌కు సమాచారం అందించారు. ఈ విషయం తెలుసుకున్న బాసర భద్రతలో ఉన్న ముథోల్ ఎస్సై బిట్ల పెర్సిస్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. దొంగతనం జరిగిన తీరును ఎస్సై పరిశీలించారు. పలు వివరాలను బాధిత కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. వెంటనే ఉన్నతాధికారులకు తెలియ జేశారు. సంఘటన స్థలంలో వేలిముద్రల సేకరణ కోసం నిర్మల్ పోలీస్ క్లూస్ టీం వారికి సమాచారం అందించారు. ఈ విషయంపై ఎస్సై బిట్ల పెర్సిస్‌ను వివరణ కోరగా దొంగతనం జరిగిన మాట వాస్తవమేనన్నారు. అయితే చోరీకి గురైన ఆభరణాలు, నగదుపై పూర్తి సమాచారం తమ విచారణ తర్వాత బయటపడుతుందని తెలిపారు. ఏదేమైనప్పటికీ ముథో ల్‌లో రోడ్డు పక్కనే ఉన్న ఇంటిలో పట్టపగలు చోరీ జరగడం చర్చనీయాం శంగా మారింది.

ఉరి వేసుకొని ఒకరి మృతి

ముథోల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లోని కోట్ల విఠల్(65) అనే వ్యక్తి మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది ఉరి వేసుకొని మృతి చెందినట్లు ఎస్సై బిట్ల పెర్సిస్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం... మృతుడి కుమారుడు గతంలో పెస్టిసైడ్ షాపు నడిపే వాడు. ఆ వ్యాపారంలో నష్టం రావడం వలన తనకు ఉన్న ఐదు ఎకరాల భూమిని అమ్మి వేశాడు. అప్పటి నుండి మృతుడు కూలీ పనులు చేసుకుంటూ అప్పుల వలన మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తి చెంది ఆదివారం రాత్రి తన ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉపాధి కూలీలకు బిల్లులు చెల్లించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కుభీర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కుభీర్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌కు ఉపాధిహామి కూలీలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము నిరుపేద నిరుద్యోగ కూలీలమని, ఉపాధి హామీలో కూలి పని చేసిన కూలీ డబ్బులు ఇంత వరకు అందివ్వలేదని, కావున అధికారులు స్పందించి తమ పెండింగ్‌లో ఉన్న కూలీ డబ్బులను వెంటనే విడుదల చేయాలని కోరారు.

యాదిలో..



పువ్వులను పూజించే పండుగ బతుకమ్మ

అన్నిపూజలకు మనం పువ్వులను వినియోగిస్తాం.అలాంటి పూలకే పూజ చేయడం బతుకమ్మ ప్రత్యేకత. ఇది తెలంగాణకే గర్వకారణం. అసలైన సిసలైన బతుకమ్మ అంటే గునుగు, తంగేడు, బీర, కాకర, గుమ్మడి, చామంతి, తదితర పువ్వులు, ఆకులతో పేర్చేది. ఇవన్నీ పొలం గట్లపై దొరికేవి. మా చిన్నప్పుడు, ఇప్పుడు కృత్రిమ పూలతో బతుకమ్మలు తయారు చేస్తున్నారు. బతుకమ్మలో పసుపుతో గౌరమ్మను పూజిస్తాం.కావునా సాక్షాత్తు బతుకమ్మ అమ్మవారు.

- కామారపు భారతి, ఆదర్శనగర్, నిర్మల్



బతుకమ్మను సంబరంగా జరుపుకొనే వాళ్లం

చిన్నప్పుడు బతుకమ్మ పండుగ కోసం నెల రోజుల ముందు నుంచే ఎదురుచూసే వాళ్లం. నేను ఐదో తరగతిలో ఉన్నప్పటి నుంచి బతుకమ్మ ఆడుతున్నాను. మాది మెట్‌పల్లి మండలం వేంపేట గ్రామం. మా ఇంట్లో ఏడుగురం అక్కచెల్లెళ్లము. చుట్టుపక్కల వారితో కలిసి తొమ్మిది రోజుల పాటు ఆడేవాళ్లం.బతుకమ్మ వేడుకలతో మానసిక ప్రశాంతత లభిస్తుంది.

- వర్దినేని రజిని, గృహిణి, నిర్మల్



పూల కోసం అడవికి వెళ్తుంటిమి

బతుకమ్మ సంబరాలు వచ్చాయంటే ఉదయమే దోస్తులతోటి కలిసి గునుగు, తంగేడు పూల కోసం సంచులు పట్టుకొని అడవికి వెళ్లే వాళ్లం. పెద్ద బతుకమ్మను తయారు చేసి గౌరమ్మను పెట్టి ఇంటి ముందట గల్లీ దోస్తులందరితో కలిసి బతుకమ్మ ఆడేవాళ్లం. తొమ్మిది రోజులపాటు కోలాటాలు, పాటలతో ఈ సంబరాలను ఎంతో ఉత్సాహంగా జరుపుకునేటోళ్లం. బతుకమ్మ అంటేనే మన పుట్టించి బిడ్డ.

- మల్లెపూల లక్ష్మీ, తరోడా



సాహితీ కిరీటి అవార్డు గ్రహీతలకు సన్మానం



అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న దృశ్యం

నిర్మల్‌చైన్‌గేట్,సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి):తెలంగాణ రచయితల వేదిక నిర్మల్ జిల్లా తరపున సాహితీ కిరీటి అవార్డు పొందిన కవులను ఘనంగా సన్మానించారు. శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో జిల్లా కవులు చేస్తున్న సాహితీ సేవలను గుర్తించి హైదరాబాద్‌లో సాహితీ కిరీటి అవార్డుతో సత్కరించారు. తెలంగాణ సాహితీ సాంస్కృతిక భాష, యాసలను ప్రతిబింబించే విధంగా ఎన్నో రచనలు చేస్తున్న నిర్మల్ కవులను తెలంగాణ రచయితల వేదిక ఘనంగా సన్మానించింది. అవార్డు గ్రహీతలు డాక్టర్ తుమ్మలదేవరావు, పత్తి శివప్రసాద్, పోలీస్ భీమేష్‌లనుశాలువా,పేమెంట్‌తోసత్కరించారు.ఈ కార్యక్రమంలో తెరవే నిర్మల్ జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల హనుమంతు,డాక్టర్ కృష్ణంరాజు బొందిడి పురుషోత్తమ రావు, కుమ్మరి నాగారాం,టీడీపీ జిల్లాఅధ్యక్షుడు త్రిపిస్ సంతోష్,కవులు,రచయితలు పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు



మల్లాపూర్‌లో విన్యాసాలు

లక్ష్మణచాంద,సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి):మండలంలోని ఆయాగ్రామాల్లో నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బోనాల జాతర నిర్వహించారు.బోనాల జాతర సందర్భంగా పోతరాజులు చేసిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి.మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలను సమర్పించారు. ముఖ్యంగా మునిపెల్లి, మల్లాపూర్ గ్రామాల్లో బోనాల సందర్భంగా చేసిన సాంస్కృతిక నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఏజెన్సీ ప్రాంతం స్థానాలను ఎస్టీలకే కేటాయించాలి



కలెక్టర్ రాజార్షిషాకు వినతిపత్రం అందజేస్తున్న ఆదివాసీ సంఘాల నాయకులు

సిరికొండ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతంలో ఉన్నటువంటి జడ్పీటీసీ, ఎంపీపీ,ఎంపీపీ, సర్పంచ్ స్థానాలను ఎస్టీలకే కేటాయించాలని జిల్లా కలెక్టర్ రాజార్షి షాను కలిసి విన్నవించారు. సోమవారం తుడుందెబ్బ మండల అధ్యక్షుడు కుమ్రం యాదవ్‌రావ్, ఆదివాసీ విద్యార్థి సంఘం నాయకులు, గ్రామ పటేల్‌లు జిల్లా కలెక్టర్ రాజార్షి షాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషనలను అమలు పర్చడం వల్ల ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీలు నష్టపోతున్నారు అని, ఇది 5వ షెడ్యూల్ పొందుపర్చిన నిబంధనలకు విరుద్ధంగా ఉందన్నారు. వెంటనే ఏజెన్సీ ప్రాంతాల్లోని గ్రామాల్లో జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలన్నింటినీ ఎస్టీలకే కేటాయించాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు పెందూర్ బండు పటేల్, సిడాం శంకర్ పటేల్, సిడాం నాగోరావ్, పెందూర్ లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.



ముథోల్‌లో బతుకమ్మను ఆడుతున్న మహిళలు



డల్లాస్‌లో బతుకమ్మతో కుంటాల వాసులు



బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఘనంగా బతుకమ్మ సంబరాలు

ముథోల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ముథోల్‌లోని ఐకేపీ కార్యాలయం వద్ద సోమవారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా మహిళ స్వయం సహాయక సంఘాల సభ్యులు రంగురంగుల పూలతో బతుకమ్మను అందంగా కార్యాలయంలో పేర్చి సంప్రదాయ గీతాల మధ్య మహిళలు ఉత్సాహంగా బతుకమ్మ ఆడారు. అనంతరం నిమజ్జనం చేశారు. ఐకేపీ ఏపీఎం గురుచరణ్ మాట్లాడుతూ..బతుకమ్మ పండుగతెలంగాణ సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, మహిళల ఏకతాటి, ఆత్మీయత,ఆనందాలకు సంకేతమని అన్నారు. పొదుపు సంగాల ద్వారా మహిళలు స్వయంసమృద్ధి సాధించడంతోపాటుసామాజికంగాకూడాముందడుగు వేస్తున్నారని అభినందించారు. ఈ కార్యక్రమంలో గురు చరణ్‌తో పాటు సీసీ గోదావరి, గంగాధర్, లక్ష్మణ్, సాయినాథ్, స్వయం సహాయక సంగ సభ్యులు, పాల్గొన్నారు.

డల్లాస్‌లో బతుకమ్మ వేడుకలు

కుంటాల: మండల కేంద్రం కుంటాలకు చెందిన మాజీ ఎంపీపీ గొట్టి ముక్కుల అరుణ రమణ రావుల కుమార్తెలు, వారి యొక్క బంధువులు సోమవారం అమెరికా దేశంలోని డల్లాస్‌లో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఖండాలు దాటిన తెలంగాణ సంస్కృతి, సంప్రదా యాల పట్ల మక్కువతో బతుకమ్మ సంబరాలను నిర్వహించడం ఆనందంగా ఉందని వారు పేర్కొన్నారు. అక్కడ బతుకమ్మ సంబరాలు నిర్వహించడం పట్ల మండల కేంద్రం కుంటాలకు చెందిన పలువురు పెద్దలు అభినందించారు. దేశం యొక్క ఔన్నత్యాన్ని ప్రపంచ దేశాలకు విస్తరింపజేయడం పట్ల వీరి కుటుంబ సభ్యులు సైతం హర్షం వ్యక్తం చేశారు.

లోకేశ్వరం:లోకేశ్వరం మండల కేంద్రంలో సోమవారం బతుకమ్మ సంబరాలు గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించుకున్నారు. గ్రామంలోని ఆడపడుచులు బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. ఆడపడుచులందరూ ఒక్క దగ్గర చేరి బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

నిర్మల్ రూరల్: పట్టణంలోని బంగల్‌పేట్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేందర్ కుటుంబ సమేతంగా బతుకమ్మ సంబరాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సంబరాల్లో వైద్య, ఆరోగ్య శాఖకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

బాసరకు పోటెత్తిన భక్తులు

- మూల నక్షత్రాన్ని పురస్కరించుకొని భారీగా భక్తుల రాక
- వందలాది మంది పిల్లలకు అక్షర శ్రీకార పూజలు



ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ



పిల్లలకు అక్షర శ్రీకార పూజలు



అమ్మవారిని దర్శించుకున్న బోథ్ ఎమ్మెల్యే

బాసర, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీ సరస్వతీ అమ్మవారి ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల ఎనిమిదవ రోజు అమ్మవారు మహాగౌరీ రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రి పర్వదినాల్లో అతి ముఖ్యమైన మూఢ నక్షత్రం సందర్భంగా ఎనిమిదవ రోజు ప్రత్యేకత సంతరించుకుంది. ఈ రోజు జరిపించే అక్షర శ్రీకార పూజలు భక్తులలో విశేషమైన ఆదరణ పొందాయి. పిల్లలు విజ్ఞానవంతులు అవుతారని విశ్వాసంతో తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా మహారాష్ట్ర నుంచి కూడా 1,883 కుటుంబాలు బాసరకు చేరి పూజలు జరిపించారు. భక్తుల రద్ది దృష్ట్యా ఆలయ అధికారులు తెల్లవారు జామునే పూజలు ప్రారంభించారు. భక్తులకు వేచి ఉండే సమయం తగ్గించేందుకు నాలుగు చోట్ల పూజా మండపాలు ఏర్పాటు చేయడంతో యాత్రికులు సులభంగా పూజలు జరిపించుకునే అవకాశం లభించింది. అయితే ఈసారి వరదల ప్రభావం భక్తుల రాకపై కొంత ప్రభావం చూపింది.

గత మూడు నాలుగు రోజులుగా బాసరలో భారీ వర్షాలు పడుతున్నాయన్న సమాచారం ప్రచారం కావడంతో చిన్నారులతో రాకకు భక్తులు వెనుకంజ వేశారు. దాంతో గత ఏడాదితో పోలిస్తే ఈసారి సగం మంది మాత్రమే బాసర చేరినట్లు అధికారులు వెల్లడించారు.



ఆలయ ప్రవేశం మార్గంలో భక్తుల రద్దీ



మహాగౌరి రూపంలో ఉన్న అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు

పాలజ్ గణేషుని దర్శనానికి విచ్చేయండి

- కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు పాలజ్ గణేష్ ఆలయ కమిటీ విజ్ఞప్తి



కేంద్ర మంత్రి పాలజ్ గణేషుని చిత్ర పటాన్ని అందజేస్తున్న ప్రతినిధులు

భైంసా, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వచ్చే వినాయక చవితి వేడుకలలో పాలజ్ గణేషుని దర్శనానికి రావాలని ఆలయ కమిటీ ప్రతినిధుల బృందం కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు విజ్ఞప్తి చేసింది. సోమవారం ఆలయ కమిటీ ప్రతినిధులు వెంకటేష్ అసర్‌వార్, సుద్దంవార్ పోతన్న, పల్సివార్ అనిల్ కరీంనగర్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని కలిసారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆలయ కమిటీ ప్రతినిధుల బృందంతో మాట్లాడి పాలజ్ గణేషుని ప్రాశస్త్యం, విశిష్టత, మహిమలు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందులో బాగంగానే ఆలయ కమిటీ బృందం వచ్చే వేడుకలకు తప్పనిసరిగా హాజరు కావాలని ఆహ్వానించగా ఇందుకుస్పందించిన కేంద్రమంత్రి బండి సంజయ్ దర్శనానికి తప్పకుండా వస్తానని వెల్లడించారు.ఈసందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు పాలజ్ గణేషుని చిత్ర పటాన్ని జ్ఞాపికగా అందచేశారు. ఇందులో భైంసాకు చెందిన తెలంగాణ శ్రీనివాస్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించిన కలెక్టర్



అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

బాసర, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి):శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో సోమవారం జరిగిన మూల నక్షత్రం పర్వదినం సందర్భంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వేద మంత్రాల నడుమ ఘన స్వాగతం పలికి, తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మూల నక్షత్రం పర్వదినం సందర్భంగా వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనానికి వస్తారు. రద్ధీ దృష్ట్యా ముందుగానే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు నిరంతరం పర్యావేక్షించాలి. అని సూచించారు.

డోర్‌లాక్ సర్వీసెస్ సమస్యల పై సమావేశం



మాట్లాడుతున్న సీఈ/కన్‌స్ట్రక్షన్, ఇన్‌చార్జీ సూపరింటెండెంట్ ఇంజనీర్ జేఆర్ చౌహాన్

ఆదిలాబాద్‌అర్బన్,సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి):డోర్‌లాక్ సర్వీసెస్ సమస్యలపై స్పాట్ బిల్లర్స్‌తో టీజీఎన్‌పీడీసీఎల్ సీఈ/కన్‌స్ట్రక్షన్, ఇన్‌చార్జీ సూపరింటెండెంట్ ఇంజనీర్ జేఆర్ చౌహాన్ సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అసిస్టెంట్ ఇంజనీర్స్ ఎవరైతే 2 సంవత్సరాల మీద పెండింగ్‌లో ఉంచిన వర్క్ ఆర్డర్స్ మీద సమావేశం నిర్వహించి అందరిని వెంటనే క్లోజ్ చేయాలని ఆదేశించారు. అదే విధంగా కలెక్షన్ వంద శాతం వసూలు చేయాలని ఆదేశించారు.

వరదొస్తే రాకపోకలు ఆగాల్సిందే..!

- లోలెవల్ వంతెనలతో తప్పని తిప్పలు
- ఏళ్లు గడుస్తున్నా మారని పరిస్థితి



వరద ఉధృతికి నిలిచిన వాహనాలు, గ్రామస్థులు

బజార్‌హత్నూర్, సెప్టెంబరు29 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఎన్నడూ లేని విధంగా వర్షాలకు లోలెవెల్ వంతెనలపై నుంచి వరద ఉప్పొంగి పారడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. దీంతో వాహనాలు నిలిచిపోయి గ్రామీణుల పనులు అర్థాంతరంగా మిగిలిపోవడం, ఉపాధ్యాయులు, స్కూ ల్ పిల్లలకు, నిత్యావసర, సంత, అత్యవసర వైద్య సేవలు అందక గ్రామీణులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఏళ్లు గడుస్తున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టి సారిం చకపోవడంతో ఎక్కడ వేసిన గొంగడి అక్కడే మిగిలింది. కనీసం మండల కేంద్రాలు, జిల్లా కేంద్రాలకు వెళ్లాలంటే ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇదీ పరిస్థితి.. కూతవేటు దూరంలోని ముత్యంపేట్, జవహర్‌నగర్ కాలానీవాసులు మండల కేంద్రానికి రావాలన్నా అడ్డుగా రెండు వైపులా ఉన్న లోలెవెల్ వాగు ఉధృతితో నాలుగు నుంచి ఐదు గంటలు ఆగా ల్సిందే. మండల కేంద్రానికి నాలుగే కిలోమీటర్ల దూరంలో ఉన్న కొత్తపల్లి గిరిజనుల పరిస్థితి మరీ దారుణం. ఎగువ భాగాన వర్షం కురిస్తే చాలు బంద్రేవ్ వాగుపై అసలు వంతెన లేకపోవడంతో రెండేసి రోజులు బయటి ప్రపంచానికి సంబంధాలు తెగిపోతాయి. అత్యవసర పరిస్థితుల్లో మంచంపై గర్భిణులను రోగులను ప్రమాదకరంగా వాగు దాటించాల్సిందే. అత్యవసరమైతే పొలం గట్లపై నుంచి కాలి నడకన బోథ్ మండలంలోని కౌట వరకు వెళ్లి సొనాల, బజార్ హత్నూర్ మీదుగా 25 కిలోమీటర్లు ప్రయాణించక తప్పదు. మోర్ఖండి గ్రామస్థులు కూడా గ్రామం దగ్గర శిథిలావస్థలోని లోలెవెల్ వాగుపై ఉన్న వంతెన దాటి రావాలి. అలాగే గుట్టపై మారుమూల గ్రామాలైన గిరిజాయి, మాన్కపూర్ గ్రామస్థులకు కూడా వాగులతో బయటకు వెళ్లాలేని పరిస్థితి ఉంటుంది. ఇప్పటికైనా కొత్తగా వచ్చే నాయకులు, పాలకులు వాగులపై వంతెనలు నిర్మించి ఆదుకోవాలని బాధిత గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రిజర్వేషన్‌లో చిత్ర విచిత్రాలు

- ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలో బీసీలే లేని గ్రామంలో బీసీ సర్పంచ్ రిజర్వేషన్

మామడ/ నేరడిగొండ/ సారంగాపూర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ● నిర్మల్ జిల్లా మామడ మండలంలోని వాస్తాపూర్, రాసిమెట్ల గ్రామాల్లో అందరూ గిరిజనులే ఉన్నారు. కానీ రెండు గ్రామాలకు బీసీ మహిళ రిజర్వేషన్ కేటాయించారు. కిషన్‌రావు పేట్ గ్రామంలో 830 జనాభాలో అంతా గిరిజనులే ఉండగా, ఇందులో కేవలం నలుగురు మాత్రమే బీసీలు ఉన్నారు. ఈ గ్రామానికి బీసీ జనరల్ కేటాయించారు. లింగాపూర్ గ్రామంలో ఎస్టీ, ఎస్సీలు ఉండగా బీసీ జనరల్ కేటాయించారు. సర్పంచ్ స్థానాలకు ఇలాంటి రిజర్వేషన్లు రావడంతో నాయకులు, గ్రామస్థులు తలలు పట్టుకున్నారు.

● నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం హన్మాన్ తండాలో బీసీలే లేరు.కాని బీసిలకే సర్పంచ్ పదవిరిజర్వేషన్ అయ్యింది.ఈతండాలలో మొత్తం 546 మంది ఓటర్లు ఉన్నారు.వీరిలో ఎస్సీలు 12మంది, 543 మంది ఎస్టీ ఓటర్లు ఉన్నారు.బీసీలు లేని చోట బీసీలకు రిజర్వేషన్ కల్పించడంపై తండావాసులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

● ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలోని సావర్గాం, పిచర, అరెపల్లి గ్రామాలలో బీసీలు లేరు. కానీ ఆ మూడు గ్రామపంచా యతీలలో బీసీ రిజర్వేషన్ రావడంతో సోమవారం కలెక్టర్‌కు, పంచాయతీ అధికారులకుప్రజలు ఫిర్యాదు చేశారు. సావర్గాం గ్రామపంచాయతీలో 505, పీచర గ్రామపంచాయతీ 425, ఆరెపల్లి గ్రామపంచాయతీలో 377 ఓటర్లు ఉన్నారు. ఈ మూడు గ్రామ పంచాయుతీలలో బీసీలు అసలే లేరు. అయినా సర్పంచ్ స్థానాన్ని బీసీలకు ఎలా కేటాయిస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

సాయిబాబా ఆలయ నిర్వహణలో నిండా నిర్లక్ష్యం



విగ్రహం



మరమ్మతులకు నోచుకోని ఫ్యాన్లు

- బాబా అలంకరణకు చిరిగిన వస్త్రాల వినియోగం
- దెబ్బతింటున్న భక్తుల మనోభావాలు
- కళ్యాణ మండపంలో విరిగిన ఫ్యాన్లు
- పట్టించుకోని దేవాదాయ శాఖ అధికారులు

నిర్మల్‌టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నిర్మల్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ఎందరో మంది భక్తుల ఆరాధ్య దైవమైన గండి రామన్న సాయిబాబా ఆలయం ప్రస్తుతం నిర్వహణ లోపంతో కొట్టుమిట్టాడుతోంది. నిన్న మొన్నటి వరకు దినదినాభివృద్ధి చెందిన ఇక్కడి ఆలయంతో పాటు పరిసరాల్లోని గ్రీనరీ భక్తులను విశేషంగా ఆకర్షించింది. ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య కూడా రోజురోజుకు పెరిగింది. అయితే ఇటీవల ఇక్కడి ఆలయం దేవాదాయ శాఖ పరిధిలోకి వెళ్లిన తర్వాత సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో ఆలయ ఆలనా పాలన చూసేవారు కరువయ్యారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా చిరిగిపోయిన వస్త్రాలతో సాయిబాబాను అలంకరించే పరిస్థితి రావడంపై భక్తులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. గర్భగుడిలో యథేచ్ఛగా ఎలుకలు సంచరిస్తుండడంతో బాబాను అలంకరించిన వస్త్రాలను కొరకడంతో పాటు భక్తులు నైవేద్యంగా సమర్పించిన ప్రసాదాలను సైతం ఆరగిస్తున్నాయని చెబుతున్నారు. ఎలుకలు తిన్న ప్రసాదాన్ని గమనించకుండా తిరిగి భక్తులకు పంచిపెట్టడం జరుగుతోందని, ఈ విషయాన్ని పలుమార్లు ఆలయ ఈవో దృష్టికి కూడా తీసుకెళ్లామని, ఆయన పట్టించుకోకపోవడంతో ఉన్నతాధికారులకు సైతం ఫిర్యాదు చేశామని పలువురు భక్తులు పేర్కొన్నారు. కల్యాణ మండపం అలంకరణ కోసం ఏర్పాటు చేసిన పలు వస్తువులతో పాటు ఫ్యాన్లు విరిగిపోయాయి. పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలకు అతి తక్కువ ఖర్చులో వివాహాలు ఇతర శుభకార్యాలు నిర్వహించుకునేందుకు ఎంతో అనువుగా ఉన్న ఇక్కడి కల్యాణ మండప నిర్వహణను అధికారులు గాలికి వదిలేయడంతో ఆలయానికి సమకూరే ఆదాయానికి గండిపడుతోందని భక్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఆలయ నిర్వహణపై దృష్టి పెట్టి గండి రామన్న సాయిబాబా ఆలయానికి పూర్వ వైభవం తీసుకురావాలని సాయి భక్తులు కోరుతున్నారు. అలాగే ఆలయ ప్రతిష్ఠకు భంగం వాటిల్లేలా వ్యవహరించి, భక్తుల మనోభావాలు దెబ్బ తినడానికి కారణమైన సంబంధిత శాఖ అధికారిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

ఆలయ అస్తవ్యస్త నిర్వహణపై అధికారులకు నివేదికలు పంపించాం

గత పదిహేను రోజుల క్రితం ఆంధ్రజ్యోతిలో వచ్చినటువంటి శీర్షికను దృష్టిలో ఉంచుకొని అడెల్లి పోచమ్మ సాయిబాబా ఆలయ ఈవో రమేష్‌పై పై అధికారులకు నివేదికలను పంపించాం. పై అధికా రులు ఆయనపై క్రమశిక్షణ చర్యలు తీసుకొని ఆయనపై బదిలీ వేటు వేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దీంతో ఆలయాల్లో నిర్వహణ లోపం లేకుండా చర్యలు చేపడుతున్నాం.

- నవీన్ కుమార్, అసిస్టెంట్ కమిషనర్

వినతుల పరిష్కారానికి సత్వర చర్యలు

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణికి వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ శ్యామలదేవి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆమె పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. భూసమస్యల వినతులపై సంబంధిత తహసీల్దార్లతో జూమ్ ద్వారా వివరాలు సేకరించి పరిష్కరించేలా చూడాలని ఆదేశించారు. ఆయా అర్జీలను సంబంధిత శాఖ అధికారులకు అందించి పరిశీలించి ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో స్రవంతి, డీఎంహెచ్ డాక్టర్ నరేందర్ రాథోడ్, మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రజల ఫిర్యాదుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ వచ్చిన ప్రతి సమస్యకు పరిష్కారం చూపే విధంగా దర్యాప్తు చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. సోమవారం పోలీసు ముఖ్యకార్యాలయంలో ప్రజల నుంచి ఆయన ఫిర్యాదులను స్వీకరించారు. సమస్యలను విన్న వెంటనే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వార ఆదేశాలు జారీ చేశారు. గ్రీవెన్స్‌లో భాగంగా 56 ఫిర్యాదులను స్వీకరించారు. భూ సమస్యలలో చట్టానికి లోబడి వ్యవహరిస్తూ ఉండాలని, ప్రజలను మోసగించే వారిని ఉపేక్షించేది లేదని ఎస్పీ స్పష్టం చేశారు. తనకు నేరుగా సమాచారం అందించాలన్న, ఫిర్యాదులు చేయాలన్న 8712659973 నెంబర్‌కు వాట్సప్ ద్వారా సమాచారం అందించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సీసీ కొండరాజు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిని జైస్వాల్ కవిత, సిబ్బంది వామన్ పాల్గొన్నారు.

స్థానిక సమరానికి సై



- లోకల్ బాడీ ఎన్నికల షెడ్యూల్ విడుదల
- రెండు విడతల్లో పరిషత్,
- మూడువిడతల్లో పంచాయతీ ఎన్నికలు
- తక్షణమే అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్
- ప్రధాన పార్టీల టికెట్ల కోసం యత్నాలు
- మొదలైన విందు రాజకీయాలు

ఎప్పుడెప్పుడా అని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్న స్థానిక ఎన్నికల షెడ్యూల్ సోమవారం విడుదలయింది. నేతలంతా స్థానిక సమరానికి సై అంటున్నారు. కొద్ది రోజులుగా ఆశావాహ నేతలు ప్రజల మధ్యనే ఉంటూ ఓటర్ల మద్దతును కూడగడుతున్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్, ఎంపీపీ, వార్డు స్థానాలకు రిజర్వేషన్ల ఖరారుతో పోటీకి సిద్ధమవుతున్నారు.

ఆదిలాబాద్, సెప్టెంబరు29 (ఆంధ్రజ్యోతి): ఇక ప్రాదేశిక ఎన్నికలతో పాటు పంచాయతీ ఎన్నికల షెడ్యులు విడుదలతో మరింత స్పీడును పెంచుతున్నారు. మొదట ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆర్థిక స్థోమత, ప్రజాబలం ఉండి తమకున్న పరిచయాలతో జడ్పీటీసీ, ఎంపీటీసీ రేసులో ఉండేందుకు నేతలు ప్రయత్నాలు మొదలుపెట్టారు. అధికార కాంగ్రెస్ పార్టీలో ఆశావాహుల సంఖ్య అధికంగానే కనిపిస్తున్న బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నుంచి ఎక్కువగానే పోటీకి సిద్ధమవుతున్నారు. రిజర్వేషన్, షెడ్యూల్ ఖరారు కావడంతో గ్రామాల్లో స్థానిక ఎన్నికల సందడి మొదలయింది. పోటీ చేసేవారంతా ఓటర్ల మద్ధతును కూడగట్టేందుకు వివిధ రకాల హామీలు, విందు రాజకీయాలను మొదలు పెట్టారు. గత ఎన్నికల్లో ఓటమి పాలైన నేతలంతా సానుభూతి కలిసి వస్తుందన్న ధీమా తో కనిపిస్తున్నారు.

మొదట పరిషత్ ఎన్నికలు....

స్థానిక ఎన్నికల నిర్వహణ కోసం ఎన్నికల సంఘం సోమవారం షెడ్యూల్‌ను విడుదల చేసింది. ముందుగా ఊహించిన్నట్లుగానే మొదట ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను నిర్వహించి ఆ తర్వాత సర్పంచ్, వార్డు స్థానాల ఎన్నికలను నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. జిలాలో 20 జడ్పీటీసీ స్థానాలు, 166 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరుగనున్నా యి. మొదట నిర్వహించే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు అక్టోబర్ 9 నుంచి నామినేషన్లను స్వీకరిస్తారు. అక్టోబరు 23, 27న రెండు విడతల్లో ఎన్నికలను నిర్వహించనున్నారు. అలాగే అక్టోబర్ 30, నవంబర్ 4, 8న మూడు దశల్లో సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికలు ఉం టాయి. స్థానిక ఎన్నికల షెడ్యులు విడుదల కావడంతో తక్షణమే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో గ్రామాలు, మండల కేంద్రా ల్లో ఉన్న వివిధ రాజకీయ పార్టీలకు చెందిన వాల్‌పోస్టర్స్, బ్యానర్స్‌ను అధికారులు తొలగిస్తున్నారు. జిల్లా సరిహద్దు చెక్‌పోస్టుల్లో అధికారులను అప్రమత్తం చేశారు. మహారాష్ట్ర నుంచి మద్యం సరఫరా కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. అయితే ఈ సారి ముగ్గురు పిల్లలు ఉన్న వారు స్థానిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులని ఎన్నికల సంఘం ప్రకటించింది. దీంతో కొంత మంది నేతల్లో నిరాశ కనిపిస్తుంది.

ప్రధాన పార్టీల్లో పోటీ....

త్వరలో జరగబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేసే వారంతా ప్రధాన పార్టీల నుంచే బరిలో దిగేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఒక్కోపార్టీ నుంచి పదుల సంఖ్యలో ఆశావాహ నేతలు ప్రయత్నాలు మొదలు పెట్టారు. ముఖ్యంగా అధికార కాంగ్రెస్ పార్టీ నుంచే పోటీచేసేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తుంది. అలాగే బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నుంచి కూడా పోటాపోటీ అన్నట్లుగా కనిపిస్తుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న జిల్లాలో భిన్నమైన పరిస్థితులే కనిపిస్తున్నాయి. బోథ్, ఆదిలాబాద్ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యే లు కొనసాగుతుండడంతో అధికార పార్టీకి దీటుగా అభ్యర్థులను బరిలో దింపేందుకు సిద్ధమవుతున్నారు. ఎలాగైనా మెజార్టీ స్థానాలను దక్కించుకోవాలని కాంగ్రెస్ పక్కాప్లాన్‌తో ముందుకెళుతుండగా ప్రధాన ప్రతిపక్ష పార్టీలైనా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కూడా స్థానిక ఎన్నికలను సీరియస్‌గా తీసుకుంటున్నాయి. ఎమ్మెల్యేలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో స్థానిక ఎన్నికల్లో త్రిముఖ పోటీ ఉండే అవకాశం కనిపిస్తుంది.

గ్రామాల్లో ఎన్నికల సందడి....

స్థానిక ఎన్నికల రిజర్వేషన్లు ఖరారు కావడం ఆ వెంటనే ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పం చ్ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో గ్రామాల్లో ఎన్నికల సందడి కనిపిస్తుంది. రిజర్వేషన్లు కలిసి వచ్చిన వారంతా పోటీకి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. మొదట పరిషత్ ఎన్నికలను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నారు. దీంతో గ్రామాల్లో విందు రాజకీయాలు ఊపందుకుంటున్నాయి. స్థానిక ఎన్నికలు జరుగడం ఖాయమని తేలిపోవడంతో ఆశావాహ నేతలు ఓటర్లను ఆకట్టుకునేందుకు పోటాపోటీ ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో సామాజికవర్గాల వారీగా బరిలో నిలిచేందుకు నేతలు సిద్ధమవుతున్నారు. సామాజిక వర్గాల మద్ధతుతో పాటు యువత ప్రజల్లో మంచి పలుకుబడి ఉన్న వారంతా ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేస్తూ గెలిచేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఇక నోటిఫికేషన్ వస్తే నామినేషన్ వేయడమే తర్వాయి అన్నట్లుగా కనిపిస్తుంది. ఈసారి ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ఆశావాహ నేతలు సిద్ధమవుతున్నారు.

మొత్తం జడ్పీటీసీ స్థానాలు - 20 జడ్పీ చైర్మన్ - జనరల్ మహిళ	
ఎస్టీ	08 స్థానాలు
ఎస్సీ	02 స్థానాలు
బీసీ	08 స్థానాలు
జనరల్	02 స్థానాలు

మొత్తం ఎంపీటీసీ స్థానాలు - 166	
ఎస్టీ	62
బీసీ	50
ఎస్సీ	14
జనరల్	40

కలెక్టర్ రాకుంటే స్థానిక ఎన్నికలు బహిష్కరిస్తాం

- వాగులో నిలబడి నార్నూర్‌లో నిరసన

నార్నూర్(ఆదిలాబాద్), సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) :చిత్తగూడవాగులో నిలబడి గ్రామస్థులు సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ ఏదైనా ఆరోగ్యం, ఇతర సమస్యలు వస్తే వాగుదాట లేకపోతున్నామన్నారు. చిత్తగూడలో 40కి పైగా దళిత కుటుంబాలు నివాసం ఉంటాయని, 300 మంది జనాభా ఉంటుందన్నారు. కానీ గ్రామానికి ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. చిన్నపాటి వర్షాలకు వాగు పొంగి ప్రవహిస్తుందన్నారు. వాగుదాటలేక గర్భిణులు వైద్యం అందక మృత్యవాత పడుతున్నారన్నారు. తమ అవస్థలు ప్రభుత్వానికి తెలియాలంటే కలెక్టర్ స్వయంగా గ్రామానికి రావాలని డిమాండ్ చేశారు. లేని పక్షం లో ఎన్నికలను బహిష్కరిస్తామని హెచ్చరించారు.



వాగులో నిరసన తెలుపుతున్న చిత్తగూడ గ్రామస్తులు

నిరాశలో ఆశావహ అభ్యర్థులు

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబా ద్ రూరల్ మండలంలో ఎన్నికలకు సంబంధించిన రిజర్వేషన్‌లు ఖరారయ్యాయి. ఈ సందర్భంగా ఆదిలాబాద్ రూరల్ జడ్పీటీసీ ఎస్టీ మహిళకు ఖరారవగా, ఎంపీపీ ఎస్టీ మహిళగా రిజర్వేషన్‌లు కేటాయించారు. దీంతో పోటీలో ఉంటామని ఎన్నోరోజుల నుంచి ఆశగా ఎదురుచూస్తున్న ఆశావహ అభ్యర్థులకు తీవ్ర ఆశాభంగం ఏర్పడింది. ఆదిలాబాద్ రూరల్‌లోని 31 గ్రామపంచాయతీ సర్పంచ్‌లకు గాను ఇరవై ఒక్క గ్రామపంచాయతీలు ఏజెన్సీలుగా ఉండడంతో అవి ఎస్టీలకు కేటాయించారు. మిగతా పది గ్రామపంచాయతీల్లో కూడా ఒకటి ఎస్టీకి కేటాయించగా ఒకటి ఎస్సీకి కేటాయించగా మిగతా 8 స్థానాల్లో రెండు బీసీ మహిళలకు, రెండు ఓసీ మహిళలకు కేటాయించగా మూడు ఓసీ జనరల్, బీసీ జనరల్‌కు ఒకటి కేటాయించారు. దీంతో ఎన్నికల పోటీ చేయడానికి కొన్ని నెలల నుంచి కసరత్తులు చేస్తున్న ఆశావాహులకు తీవ్ర నిరాశకు గురవుతున్నారు.

హక్కుల సాధనకు పోరాడాలి



ర్యాలీలో పాల్గొన్న సోయం బాపూరావు

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి):మహారాష్ట్రలో బీసీలుగా చెలామణి అవుతున్న లంబాడిలు ఎస్టీ కేటాలో తమను చేర్చాలని డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో పాండర్ కౌడలో ఆదివాసీ కృతిసమాజ్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మాజీఎంపీ, రాజ్ గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాపూరావు ర్యాలీకి హాజరయ్యారు. పట్టణ ప్రధాన వీధుల గుండా భారీ ర్యాలీ చేపట్టిన అనంతరం బిర్సా ముండా, అంబేద్కర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సోయం బాపూరావు మాట్లాడుతూ... ఆదివాసీ సమాజం సైనికుల్లా పని చేసి హక్కుల సాధనకు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ర్యాలీలో మహారాష్ట్ర మాజీ విద్యాశాఖ మాజీ మంత్రి వసంత్ రావు పూర్కే, బావురావు మార్కె, తెలంగాణ రాజ్ గోండ్ సేవ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షలు సేడ్మకి ఆనంద్ రావు పాల్గొన్నారు.

రేషన్‌డీలర్ల ఆందోళన

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రేషన్‌డీలర్లకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేసి వారిని ఆదుకోవాలని ఎమ్మెల్యే పాయల్‌శంకర్ అన్నారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా ధర్నా నిర్వహించారు. ధర్నాకు ఎమ్మెల్యే మద్ధతు తెలిపి ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వేణుగోపాల్, సుధీర్ పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్య సంరక్షణే ధ్యేయం

ఉట్నూర్, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల మహిళల ఆర్యోగ సంరక్షణ కోసం ప్రభుత్వం స్వస్థనారి స్వశక్తి కార్యక్రమాన్ని అమలు చేస్తుందని అదనపు వైద్యాధికారి కుడిమేత మనోహర్ అన్నారు. సోమవారం హస్నాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ్ నారీ- సశక్త్ పరివార్ అభియాన్ లో భాగంగా ఆరోగ్య శిబిరం నిర్వహించారు.

'ఫిర్యాదు చేసినందుకు బెదిరిస్తున్నారు'

బోథ్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల కేర్ పైన ఫిర్యాదు చేయడంతో తమను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మహిళా సంఘం అధ్యక్షురాలు శోభ సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలని ఒత్తిడి చేస్తున్నారని, మీ అంతు చూస్తామంటూ బెదిరిస్తున్నారని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

'పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయండి'

బోథ్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు ఐక్యంగా ఉండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ విచార్ విభాగ్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ తుల అరుణ్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం సోనాల మండల కేంద్రంలో వివిధ గ్రామాల పార్టీ కార్యకర్తలు నాయకులతో సమావేశం అయ్యారు.

ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శికి లంబాడి జేఏసీ సన్మానం

ఉట్నూర్, సెప్టెంబరు29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ఉపాధ్యాయుడు జాదవ్‌రవిని సోమవారం మండలంలోని కొత్తగూడలో లంబాడీ జేఏసీ ఉమ్మడి జిల్లా శాఖ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా లంబాడీ జేఏసీ ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శులు బానోత్‌జగన్‌నాయక్, బానోత్ రామారావు, ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు నేతావత్‌రాందాస్‌నాయక్ మాట్లాడుతూ గిరిజన లంబాడీ సమాజం నుంచి ఏ రంగంలోనైనా రాణించి పదవులు పొందిన వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. జాదవ్‌రవి తండ్రి జాదవ్ శంకర్‌నాయక్ కూడా ఉద్యోగ సంఘాలలో రాణించారని కొనియడారు. కార్యక్రమంలో లంబాడి జేఏసీ నాయకులు దిలేష్‌చౌహాన్, జైవంతరావు, ఉమేష్, బోడ ఆకేషనాయక్,రాథోడ్‌రామారావునాయక్, జాదవ్‌రవి, లౌడియా పరశురాం, పోషన్న, సోమ, వర్షియానాయక్, రాముల్‌నాయక్, రాథోడ్‌సచిన్ తదితరులు పాల్గొన్నారు



జాదవ్ రవినాయక్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఫ్లెక్సీల తొలగింపు



సోనాలలో ఫ్లెక్సీలు తొలగిస్తున్న సిబ్బంది

బోథ్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి):బోథ్, సోనాల మండల కేంద్రాలలో ఉన్న వివిధ రాజకీయ నాయకుల ఫ్లెక్సీలను తొలగించారు. ప్రభుత్వఉద్యోగులు, అంగన్‌వాడీ టీచర్లతో పాటు రేషన్ డీలర్లు, ఏఎన్‌ఎంలు రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసే సమావేశాలకు వెళ్లవద్దని సోనాల తహసీల్దార్ ఆదేశాలు జారీ చేశారు.

దినసరి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- 18వ రోజుకు చేరిన సమ్మె
- రాష్ట్ర నాయకుల సంఘీభావం

ఉట్నూర్, సెప్టెంబరు29 (ఆంధ్రజ్యోతి): దినసరి ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నిరవధిక సమ్మెకు ఎస్సీ ఎస్టీ, బీసీ మైనార్టీ సంక్షేమ శాఖ 4వ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు సంఘీభావం తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు భుక్యశంకర్‌నాయక్ హాజరై మాట్లాడారు. 18 రోజులుగా తెలంగాణ రాష్ట్రంలోని ఉట్నూర్, భద్రాచలం, ఏటూరు నాగారం ఐటీడీఏల ఎదుట, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు 1000 మంది తమ న్యాయమైన డిమాండ్ల కోసం 18 రోజులుగా సమ్మె చేసున్నా ప్రభుత్వం స్పందించక పోవడం విడ్డూరమన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా ప్రతినిధులు మాన్సింగ్, నారాయణ, కామారెడ్డి జిల్లా ప్రతినిధులు శంకర్,మంచిర్యాల జిల్లా ప్రజలు లక్ష్మణ్, పోచయ్య, నిర్మల్ జిల్లా పరిధిలో సాయన్న,ఎంఎ ఖాదర్‌లతో పాటు దినసరి ఉద్యోగుల సంఘం నాయకులు ఏరుకొండ రాజన్న, రాథోడ్ బాపురావు, బాపు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనేతరులకు తీవ్ర అన్యాయం

ఇంద్రవెల్లి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్లలో తమకు తీవ్ర అన్యాయం జరిగిందని, గిరిజనేతరుల సంఘం మండల అధ్యక్షుడు సంజయ్ లహానే, ఇంద్రవెల్లి గ్రామపటేల్ మారుతి డోంగ్రేలు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ఖరారు చేసిన రిజర్వేషన్‌పై చర్చించారు. మండలంలో ఖరారు చేసిన జడ్పీటీసీ, ఎంపీటీసీల రిజర్వేషన్‌లో గిరిజనేతరులకు, ఎస్సీ, బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. అధికంగా ఎస్సీలు, బీసీల జనాభా కలిగి ఉన్న చోట కూడా జనరల్ రిజర్వేషన్లు కల్పించడం సరైందికాదన్నారు. ఇప్పటికైనా జనాభా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు దేవ్‌పూజే మారుతి, ఆరెల్లి రాజలింగు, మస్కేరాజవర్ధన్, మిర్జాజిలానీ బేగ్, మహ్మద్ అంజద్, షేక్ సుఫియన్, శివకుమార్, గణేష్, తహేరే, గణేష్‌డోంగ్రే ఉన్నారు.

ల్యాప్‌టాప్‌ల పంపిణీ

ఉట్నూర్, సెప్టెంబరు29 (ఆంధ్రజ్యోతి): ప్రతిభావంతులైన గిరిజన విద్యార్థులను ప్రోత్సహించడానికి ఐటీడీఏ ద్వారా ల్యాప్‌టాప్‌లో పంపిణీ చేస్తున్నామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ క్యాంపు కార్యాలయంలో ప్రతిభ కనబరిచిన గిరిజన విద్యార్థి నేరడిగొండ మండలం బుగ్గారాం గ్రామానికి చెందిన జాదవ్‌నవనీత్‌కు ప్రోత్సాహకంగా ల్యాప్‌ట్యాప్ అందించామన్నారు.



ఉట్నూర్‌లో ల్యాప్‌టాప్ అందిస్తున్న పీవో

సాయితేజ్ కుటుంబానికి న్యాయం చేయండి

ఉట్నూర్, సెప్టెంబరు29 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్య చేసుకున్న జాదవ్‌సాయి తేజ కుటుంబాన్ని ఐటీడీఏ ద్వారా ఆదుకోవాలని సోమవారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తాకు పలువురు వినతి పత్రం అందించారు. నారపల్లిలో బీటెక్ రెండోసంవత్సరం చదువుతూ కొంత మంది సీనియర్ల ర్యాగింగ్ కారణంగా మానసిక వేదనకు గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్, విపుల్, రవి, రంగలాల్, శ్రీనివాస్‌జాదవ్ పాల్గొన్నారు.



ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రైతుల సంక్షేమమే ధ్యేయం

- చైర్మన్ ముడుపు దామోదర్‌రెడ్డి

తలమడుగు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే సహకార సంఘ ధ్యేయమని సహకార సంఘ చైర్మన్ ముడుపు దామోదర్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ ముడుపు దామోదర్ రెడ్డి అధ్యక్షతన సంఘం డైరెక్టర్లతో కలిసి మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం సీఈవో మోతే శ్రీనివాస్ సంఘం ద్వారా చేపడుతున్న పనుల ప్రగతిని చదివి వినిపించారు. అనంతరం సంఘం చైర్మన్ దామోదర్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రుణాలు అందించామన్నారు. అదే విధంగా రైతులకు ఎరువుల కొరత లేకుండా దాదాపు మూడు కోట్ల 50 లక్షల వ్యయంతో ఎరువులను విక్రయించామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పద్మాకర్ రెడ్డి సీఈఓ శ్రీనివాస్, డైరెక్టర్లు మణిరాం జాదవ్, శ్రీనివాస్ రెడ్డి, కష్టాల ప్రతాప్, జేలంధర్, సిబ్బంది సాగర్, భీమావు, రమాకాంత్, సత్యనారాయణ ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.



మహాజన సభలో మాట్లాడుతున్న చైర్మన్ ముడుపు దామోదర్‌రెడ్డి